క్లుప్తంగా

వరికూటి వినూత్న ప్రచారం
ఆటో నడుపుతూ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన అశోక్‌బాబు



పెదగాదెలవర్రు(వేమూరు): సార్వత్రిక ఎన్నికలలో భాగంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆటో నడుపుతూ స్థానికులను ఆకర్షించారు. పెదగాదెలవర్రు నుంచి చినగాదెలవర్రు వరకు ఆటో నడుపుతూ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. వరికూటితో పాటు కారుమూరి వెంకటరెడ్డి, గాజులవర్తి సుధీర్ ఆటోలో ముందుకు సాగారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం
చెరుకుపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మండల పరిషత్ అధ్యక్షుడు మత్తి దివాకర రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించటం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస మూర్తి ఆదివారం చెప్పారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని పలు అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించటం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

అమర్తలూరులో నేడు ఎన్నికల ప్రచారం
కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు యలవర్తి సురేష్ తెలిపారు. మండలంలోని కూచిపూడి గ్రామంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, పెదపూడి గ్రామంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు, మూల్పూరు గ్రామంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం
తాడికొండ: ఎలాంటి రసీదులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు శ్రీ సిటీ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భాను చందర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రూ.1.20 లక్షల నగదు పెట్టుకొని వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేని కారణంగా తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఐటీ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి
తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి అని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ విషం చిమ్ముతోందని, తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని ప్రధాన నేతలే ప్రకటించడం మైనార్టీలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బీజేపీతో లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న టీడీపీ, జనసేన జతకట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ముస్లిం సమాజం కూటమికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు.



రాజుకాల్వ గ్రామంలో ఆధునిక హంగులతో ఏర్పడిన సచివాలయ భవనం



వసతులతో రూపుదిద్దుకున్న విలేజ్ హెల్త్ క్లినిక్

గ్రామ స్వరాజ్యం..జగనన్న పాలనలో సాకారం

- మారుమూల గ్రామం రాజుకాల్వలో అభివృద్ధి కాంతులు
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.22 కోట్లతో మౌలిక వసతుల ఏర్పాటు
- ఎంపీ మోపిదేవి చొరవతో మోడల్ విలేజ్‌గా రూపాంతరం
- మారుమూల పల్లెల అభివృద్ధి పట్ల సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి తార్కాణం



అద్దంలా మారిన సీసీ రహదారులు



తుదిదశకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు

రేపల్లె రూరల్: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యమవుతుందని నిరూపితం అయ్యింది. పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరుతోంది. గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకు చేర్చడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమైంది. విసిరి వేయబడినట్లు బంగాళాఖాతానికి దగ్గరగా ఉన్న ఓ కుగ్రామం రేపల్లె మండలానికి చెందిన రాజుకాల్వ. రేపల్లె పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ప్రజలు ప్రభుత్వ సేవలు కావాలన్నా, ఇతర అవసరాలు తీర్చుకోవాలన్నా రేపల్లె పట్టణానికి నిత్యం రావాల్సిన పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన సరళితో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో గ్రామ రూపురేఖలు మారాయి. ప్రస్తుతం గ్రామంలో విలేజ్ హెల్త్ సెంటర్, సచివాలయ భవనం, ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, పలుచోట్ల సీసీరోడ్లు ఏర్పడి మోడల్ విలేజ్‌గా రూపాంతరం చెందింది.

రూ.22 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

రాజుకాల్వ గ్రామంలో గత ఐదు సంవత్సరాల కాలంలో రూ.22 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.19.50 కోట్లు నేరుగా వారి ఖాతాలలో జమయ్యాయి. అదేవిధంగా రూ.45 లక్షలతో సచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.60 లక్షలతో సీసీరోడ్లు పూర్తయ్యాయి. రూ.70 లక్షలతో ఇంటింటికి తాగు నీటి పైపులైన్‌లు ఏర్పాటుతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వైభవంగా నూకాలమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా నూకాలమ్మను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని ప్రజలు ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి గంటసాల నరసింహమూర్తి మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉల్లంగుంట సాంబశివరావు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు శ్రీ గోగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని ద ర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల పాలిట కల్పతరువుగా కోరిన కోరికలు తీర్చే బంగారు తల్లిగా నిత్య నీరాజనాలు అందుకుంటున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు తరించారు. పూజా కార్యక్రమాను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



బాపట్లటౌన్: ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆదివారం మండలంలోని ఈతేరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని చుండూరుపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం తరలించినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. డీఎస్పీతో పాటు సీఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- ఆముదాలపల్లి, ముత్తుపల్లి, పల్లపట్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ముత్తుపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: రాష్ట్రంలో మళ్లీ రానున్నది జగనన్న పాలనేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి, ముత్తుపల్లి, పల్లపట్ల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు బృందం ప్రజల్లోనికి వస్తుందని ఈ మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని తెలిపారు.గత ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని ఈ 5 సంవత్సరాల్లో 98శాతం అమలు పరిచి ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు లాగా సాధ్యం కాని హామీలను ప్రకటించి ప్రజలను మోసం చేసే ఉద్దేశం జగనన్నకు లేదని చెప్పారు. ఏదైతే చేయగలమో దానినే ప్రకటించారని చెప్పారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్నది జగనన్న ప్రభుత్వమేనని తెలిపారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ ఒక్కడిపై ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి దాడి చేస్తున్నాయంటేనే జగనన్న ప్రజల్లో ఎంతబలంగా ఉన్నాడో అర్థమౌతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ వంటి ఎన్ని పార్టీలు ఏకమైనప్పటికీ జగనన్న సునామీకి ఈ పార్టీలన్నీ కొట్టుకుపోవడం ఖాయమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం తథ్యమని చెప్పారు. అందులో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో గెలిచి జగనన్నకు కానుకగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు గాదె మధుసుదనరెడ్డి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాధబాబు, వైఎస్సార్ సీపీ యువ నాయకులు మోపిదేవి రాజీవ్, ఈవూరు సృజన్, మాజీ జెడ్పీటీసీ ప్రసాదంవాసుదేవ, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ బసవపున్నారావు, పిట్టు ఏడుకొండలు, రెడ్డి, గంగుల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

అణగారిన వర్గాలకు వైఎస్సార్ సీపీతోనే మేలు



పెదగాదెలవర్రులో వరికూటితో ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదగాదెలవర్రు(వేమూరు): ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ కూటమి పెద్ద నాటక కూటమి అని ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ కొమరాల శ్రీనివాస్ అన్నారు. చుండూరు మండలంలోని పెదగాదెలవర్రులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వరికూటి అశోక్ బాబును కలిసి ఎమ్మార్పీఎస్ తరుపున సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి పెద్ద నాటకం అని అణగారిని వర్గాల ప్రజలు ఎవరు నమ్మవద్దని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండాల ఆనంద్ మాదిగ, నాగభూషణం మాదిగ, సుధీర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- అశోక్‌బాబు సతీమణి లక్ష్మి
- కోనేటిపురంలో గౌడ సంఘం మహిళలతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

కోనేటిపురం(భట్టిప్రోలు): ప్రజల నాడి తెలిసిన నాయకుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి పేరు తెచ్చుకున్నారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి అన్నారు. ఆదివారం రాత్రి భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామ సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో గౌడ సంఘ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల పక్షపాతిగా సంక్షేమ పాలన అందించిన జగన్‌కు ప్రజా క్షేత్రంలో ఆదరణ పెరుగుతోందన్నారు. ఆయనకు వస్తున్న ఆదరణకు ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన నాయకులు ఇప్పుడు జగన్‌ను అడ్డుకునేందుకు తెర వెనుక రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఎంతమంది ఎన్నిరకాల వ్యూహ రచనలు చేసినా సీఎం జగన్‌ను అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్తను, ఎంపీగా నందిగం సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైఎస్సార్ సీపీ నాయకులు మల్లోలు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన
తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ డిఠి శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ ఎక్లేవ్ భవనం ఆవరణలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరం కొనసాగించారు. పేర్లు నమోదు చేసుకున్న 300 మందికి సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ డి.శారద ఉచితంగా బీపీ, షుగరు, ఫిజియోథెరపీ పరీక్షలు చేశారు. ఈసీజీ తీశారు. అవసరమైన వారికి నెలకు సరిపడ బీపీ, కాల్షియం, విటమిన్ మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన అందరికీ అల్పాహారం సమకూర్చారు. పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, పావులూరి భానుమూర్తి, శ్రీశైల భక్త సేవాసమితి సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.



విశాలంగా విస్తరించిన పెదకాకాని శివాలయం రోడ్డు



ట్రాఫిక్ లేని పెదకాకాని సెంటర్ విస్తరణ



చెరువు కట్టపై నూతనంగా వేసిన వాకింగ్ ట్రాక్



పెదకాకాని బాజీబాబా దర్గాకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

సంక్షేమం, అభివృద్ధికి చెరగని చిహ్నం

- పెదకాకానిలో నలు దిశలా అభివృద్ధి పరుగులు
- రోడ్లు, డ్రెయిన్లు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- 25 ఏళ్లలో సాధ్యంకానిది, ఐదేళ్లలో సుసాధ్యం

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతులు, శ్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్క పెదకాకాని గ్రామంలోనే రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధులతో పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి రోడ్డు విస్తరణ, నిర్మాణం, డివైడర్ సెంటర్ లైటింగ్ మంచి నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. 25 ఏళ్లుగా పొన్నూరు నియోజకవర్గంలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో చేసి, చూపించారు. ఒక్క బాజీబాబా దర్గాకు రూ.1.97 కోట్లతో విశాలమైన సీసీ రోడ్డుతో పాటు ప్రహరీ నిర్మాణం జరిగింది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పొన్నూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,600 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలు అభివృద్ధి సాధించాలని, వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు సీఎం వైఎస్ జగన్.



ప్రతి ఇంటికి ప్రచారం

వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సోదరి తీగల వాణిశ్రీ పట్టణంలోని 8, 9 వార్డులలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి కర పత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. -పొన్నూరు

వైఎస్సార్ సీపీలో గౌడ కుటుంబాల చేరిక



మండలంలోని మునిపల్లె గ్రామంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాల సభ్యులు పొన్నూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ కూచిపూడి స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా అంబటి ఆహ్వానించారు. -పొన్నూరు